

## • ప్రశ్నిస్తే గెంటివేతే..



సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో పథకాల గురించి ప్రశ్నించిన వృద్ధుడిని బయటకు పంపుతున్న పోలీసులు

## • అర్హులకు ఇస్తరా? ఇవ్వరా?



నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్నిలో పథకాల ప్రతుల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి(ఏడీ ఎస్సీ కార్పొరేషన్) మాట్లాడుతుండగా అడ్డుతగిలిన వృద్ధుడు సాయన్న

## • ఇల్లు రాలేదని కంటతడి



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బురుజుబావి గ్రామసభలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని కన్నీటిపర్యంతమవుతున్న మహిళ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాల ప్రారంభోత్సవం పలుచోట్ల రసాభాసగా మారింది. మండలానికో పైలట్ గ్రామంలో లబ్ధిదారులకు పథకాల మంజూరు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ రచ్చరచ్చ అయ్యింది. రాత్రికి రాత్రే జాబితాలు తయారుచేసి అర్హుల పేర్లు తొలగించారంటూ ప్రజానీకం మండిపడింది. అర్హులకు పథకాలు దక్కలేదంటూ నిరసనలు వ్యక్తమయ్యాయి. అనర్హులకు ఎలా పథకాలు కట్టబెడతారంటూ మండిపడ్డారు. ఉన్నోళ్లకే రెండేసి పథకాలు ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పలు గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు.

## • అధికారిపై యువగళం..



యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం బురుజుబావిలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని మండల ప్రత్యేకాధికారితో వాగ్వాదం చేస్తున్న యువకుడు

## • పోలీసులపై ఫైర్..



సూర్యాపేట జిల్లా మోతె మండలం వల్లబాపురంలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

## • అధికార, ప్రతిపక్ష నాయకుల ఘర్షణ



పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో ఘర్షణ పడుతున్న అధికార కాంగ్రెస్-ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

## • ఇల్లు లేకుండా పేపర్లు వద్దే వద్దు..



యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం కోతులాపురంలో ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంతో ఆత్మీయభరోసా పథకం ప్రొసీడింగ్ పేపర్‌ను స్పెషల్ ఆఫీసర్ జయశ్రీకి తిరిగి ఇచ్చేసిన మహిళ

## • అడ్డుకుంటాం.. నిలదీస్తాం..



యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం కోతులాపురంలో నిరుపేద కుటుంబాలైన తమకు రేషన్‌కార్డులు, ఇండ్లు ఎందుకు రాలేదని ప్రత్యేకాధికారి జయశ్రీ కారును అడ్డుకున్న మహిళలు

## • అనర్హులకే పథకాల వర్తింపా?



వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో అనర్హులకే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వివరిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

## • పేరు తొలగించడం అన్యాయం..




జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం విట్టంపేటలో రాత్రికి రాత్రే ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితా నుంచి పేరు తొలగించి అన్యాయం చేశారని అధికారులు, కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్న గ్రామస్థుడు

# పింఛన్ పెంచలే.. కొత్తది ఇవ్వలే!

## చేయూతకు కాంగ్రెస్ సర్కారు మొండి 'చెయ్యి'

- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు
- నిరుడు ప్రజాపాలనలో.. తాజాగా గ్రామసభల్లో అప్లికేషన్లు
- 25 లక్షల అర్జీలు పెండింగ్
- నేతలు, అధికారుల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): 'అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండు వేల పింఛన్‌ను నాలుగు వేలు చేస్తాం. దివ్యాంగుల పింఛను ఆరు వేలు చేస్తాం..' అంటూ ఆర్భాటంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి ఏడాది దాటినా పింఛన్ల పెంపు ఊసెత్తడం లేదు. కనీసం కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదు. నిరుడు నిర్వహించిన ప్రజాపాలనలో, తాజాగా గ్రామసభల్లో దరఖాస్తులు సమర్పించిన సుమారు 25 లక్షల మంది 'ఆసరా' కోసం కండ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నారు. అధికారులు, ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కనిపించిన నాయకుల కాళ్లావేళ్లా పడుతూ వేడుకుంటున్నారు. అయినా ప్రభుత్వం కనికరించడం లేదు.

### 13 నెలలుగా పాత పింఛన్లే

పింఛన్లను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారం చేపట్టి 13 నెలలైనా పట్టించుకోవడం లేదు. కేసీఆర్ సర్కారు ఇచ్చిన పాత పద్ధతిలోనే ఇప్పుడూ పింఛన్లు ఇస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 43,72,784 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వృద్ధులతో పాటు ఇతర వర్గాలకు నెలనెలా రూ.2,016 చొప్పున, దివ్యాంగులకు రూ.4,016 చొప్పున పింఛన్లు ఇస్తున్నారు. ఇప్పటి వరకు పింఛను పెంపు దిశగా సర్కారు అడుగు వేయలేదు. కనీసం సమీక్షా కూడా నిర్వహించలేదు.

### 60 వేల మంది తొలగింపు

కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. వివిధ కారణాలు చూపుతూ లబ్ధిదారుల్లో కోత పెడుతున్నది. ఒకటికి మించి పింఛన్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ గతేడాది జూలై 13న 1,826 మందికి రికవరీ నోటీసులు జారీచేసింది. వీరితో పాటు వలసపోయిన, మరణించిన సుమారు 60 వేల మంది పింఛన్లను తొలగించింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 43.12 లక్షలకు పడిపోయింది. దీంతో ప్రతినెలా సర్కారుపై సుమారు రూ.144 కోట్ల భారం తగ్గింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 20 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో మరో 5 లక్షల మంది కొత్తగా అర్జీలు సమర్పించారు. మొత్తంగా 25 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

### లబ్ధిదారులకు రూ.30 వేల బాకీ

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు ప్రతినెలా రూ.4 వేల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన సుమారు నెలకు రూ.900 కోట్ల చొప్పున ఇవ్వాల్సి ఉన్నది. 13 నెలలకు గానూ రూ.11,070 కోట్లు బాకీ పడింది. గతేడాది జనవరి, ఆగస్టు నెలల పింఛన్లను ఎగ్గొట్టింది. ఈ లెక్కన ఒక్కో లబ్ధిదారుడికి రూ.30 వేల చొప్పున మొత్తంగా సుమారు రూ.13,000 కోట్లకు పైగా బాకీ ఉన్నది.

### కేసీఆర్ పాలనలో ఠంచన్‌గా

నిస్సహాయులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 2014 నవంబర్‌లో ఆసరా పథకాన్ని ప్రారంభించింది. మొదటి విడత నెలకు రూ.వెయ్యి చొప్పున అందజేసింది. 2015 మార్చిలో బీడీ కార్మికులు, 2017 ఏప్రిల్‌లో ఒంటరి మహిళలు, 2018 ఏప్రిల్‌లో ఫైలేరియా బాధితులు, 2022 ఆగస్టు నుంచి డయాలసిస్ పేషెంట్లను, 2023 జూలైలో టేకేదార్లను ఈ స్కీంలో చేర్చింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసరా పింఛన్లను రూ.2016కు పెంచింది. పదేండ్లలో నిరాటంకంగా ఆర్థిక చేయూతనందించింది. కరోనా కష్టకాలంలోనూ నిలిపివేయకుండా భరోసానిచ్చి ఆసరా లబ్ధిదారుల కడుపు నింపింది.

### 73 ఏండ్లున్నా పింఛన్ రావట్లేదు



మాది ఓదెల మండలం కొలనూర్. నా పేరు ఎండీ అక్తర్ బేగం. నాకు 73 ఏండ్లు. రెండు నెలల కిందట కాలు విరిగింది. ఆపరేషన్ చేయించుకుని మంచం పట్టిన. పింఛన్ కోసం పోయినేడు దరఖాస్తు పెట్టుకున్న. మండలాఫీసుకుపోయి సార్లను చాలాసార్లు కలిసిన. అయినా మంజూరు కాలేదు. మొన్న కూడా దరఖాస్తు పెట్టిన. ఈ సర్కారుకు దండం పెట్టి చెబుతున్న పింఛన్ ఇయ్యాలె.

**-అక్తర్ బేగం, వృద్ధురాలు, కొలనూర్, ఓదెల, మండలం, పెద్దపల్లి**

### నా భర్త చనిపోయినా ఇస్తలే



మాది ఓదెల మండలం కొలనూర్. నా భర్త మొగిలి చనిపోయిండు. గుంట భూమి లేని నిరుపేదలం. నాకు ఇద్దరు కొడుకులు. పాణం బాగా లేక నేను ఇంట్లోనే ఉంటున్నా. కలోగంజో తాగుతూ బతుకీడుస్తున్నం. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న. కానీ, పింఛన్ ఇత్తలేరు. మా కుటుంబ పరిస్థితి కష్టంగా ఉంది. పింఛన్ ఇయ్యాలని సీఎం రేవంత్‌రెడ్డికి దండం పెట్టి కోరుతున్న. అట్లయితేనే మా బతుకు ఎళ్తది.

**- లతమ్మ, వితంతువు, కొలనూర్, ఓదెల మండలం, పెద్దపల్లి**

# పథకాల అమలు బోగస్

- 4 పథకాలు, ఒక్కగ్రామం అనడం విచిత్రం
- నిన్నటిదాకా దరఖాస్తులు తీసుకొని తెల్లారే లబ్ధిదారుల ఎంపిక అనడం హాస్యాస్పదం
- గ్రామ సభలను ప్రహసనంగా మార్చిండ్రు
- పథకాలను ఎగ్గొట్టేందుకే 'ఇందిరమ్మ' లొల్లి
- కాంగ్రెస్, బీజేపీల నైజం ప్రజలకు అర్థమైంది
- అందుకే ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపాటు




మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల

సూర్యాపేట, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : నాలుగు పథకాల అమలు కార్యక్రమం అంతా బోగస్సేనని, ఒక్కో మండలంలో ఒక్క గ్రామాన్నే తీసుకొని పథకాలు అమలు చేస్తామనడం విడ్డూరంగా ఉన్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిన్నటి వరకు దరఖాస్తులు తీసుకొని తెల్లారే లబ్ధిదారుల ఎంపిక అనడం హాస్యాస్పదంగా ఉన్నదని దుయ్యబట్టారు. గ్రామ సభలను ప్రహసనంగా మార్చారని, రెండు సార్లు దరఖాస్తులు తీసుకొని బుట్టదాఖలు చేసి మళ్లీ దరఖాస్తులు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. పైరవీ చేసుకున్న వారికి మాత్రమే లబ్ధి చేకూరుతున్నదని, గ్రామ సభలన్నీ ప్రజల నిరసనలతో మార్మోగాయని గుర్తుచేశారు. మండలానికి ఒక్క గ్రామం, మార్చి 31 అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇంకా మభ్య పెడుతున్నదని ఫైర్ అయ్యారు. డిసెంబర్ 9 అని చెప్పి ఇప్పుడు సంవత్సరానికి ఒక గ్రామంతో మొదలు పెట్టారని, రాష్ట్రమంతా పూర్తి చేయడానికి ఎంత సమయం తీసుకుంటారో చెప్పాలని నిలదీశారు. హామీల అమలులో విఫలమయ్యారని, గత సీఎం కేసీఆర్ ఇచ్చిన కరెంటు, నీళ్లను కూడా ఇవ్వలేక గప్పాలు కొడుతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ బొమ్మ పెడితే పథకాలకు పైసలివ్వమనేది కేవలం హామీలను ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న డ్రామాలని మండిపడ్డారు. ఓ పార్టీ రాష్ట్రానికి టోకరా ఇస్తే, మరో పార్టీ దేశానికి టోకరా ఇస్తున్నదని దెప్పిపొడిచారు. ఆ రెండు పార్టీలూ తెలంగాణ ద్రోహ పార్టీలేనని, వాటి నైజం ప్రజలకు అర్థమై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. గ్రామ సభల ద్వారా ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తుతున్నదని, కాంగ్రెస్, బీజేపీలకు రానున్న రోజుల్లో తెలంగాణ ఉద్యమం నాటి చుక్కలే చూపిస్తారని హెచ్చరించారు. ప్రజా ఉద్యమానికి బీఆర్ఎస్ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. ఇచ్చిన హామీలను డిసెంబర్ 9 సోనియా జన్మదినం సందర్భంగా అమలు చేస్తామని చెప్పి రెండు బర్త్‌డేలు పోయాక ఇప్పుడు ఒక్క గ్రామం అంటున్నారని ఎద్దేవా చేశారు. మార్చి 31 తర్వాతైనా పూర్తి స్థాయి పథకాల అమలు అనుమానమేనని చెప్పారు. దోచుకోవడం కప్పం కట్టడంతోనే రేవంత్‌రెడ్డికి సమయం సరిపోవడం లేదని, ఇక పాలన ఏం చేస్తారని దెప్పిపొడిచారు.